క్లుప్తంగా

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణ పరిధిలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం బెల్లపువీధి కన్యకా పరమేశ్వరి గుడి నుంచి బాడవ తోట వరకు రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను సుధారాణి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని కమిషనర్ ప్రసాదరాజును ఆదేశించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

శంఖవరం: ఆటో డ్రైవర్లు విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూ ప్రయాణికులను గమ్యానికి క్షేమంగా చేర్చాలని అన్నవరం ఎస్సై కిశోర్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పానీయాలు సేవించి ఆటో నడపరాదని, పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వాడరాదన్నారు. స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే ఆటోలు మరింత జాగ్రత్తగా నడపాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

కిర్లంపూడి: ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై మండల అధికారులతో సోమవారం సమీక్ష ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా మండలానికి 10వేల మొక్కలు ఇస్తామన్నారు. తద్వారా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఏపీఓ నాగమణి ఉన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

తుని: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణి డిమాండ్ చేశారు. మహిళా హింస నివారణకు అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలని ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన పోరుయాత్ర మంగళవారం తుని చేరుకుంది. భారత విద్యార్థి ఫెడరేషన్, మహిళ సంఘాలు స్వాగతం పలికాయి. సభలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.రమణి ప్రసంగించారు. ప్రభుత్వం మీడియా మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలన చిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ ప్రచారాలపై నియంత్రణ పాటించేలా చూడాలన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, కార్యదర్శి సత్యవతి, తుని పట్టణశాఖ కార్యదర్శి జి.అమ్మతల్లి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము పాల్గొన్నారు.

మణిపూర్ దాడులకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

తొండంగి: మణిపూర్‌లో ఇటీవల కుకీ తెగ ప్రజలపై దాడులను ఖండిస్తూ మండలంలోని క్రైస్తవులు మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్లు, క్రైస్తవులు ఏ.కొత్తపల్లి నుంచి తొండంగి వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. చర్చిలను ధ్వంసం చేయడంతోపాటు మారణకాండకు తెగపడిన కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. తొండంగిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెక్కం చంద్రగిరి, సాపిశెట్టి చిన్న, దడాల విజయ్‌కుమార్, నందెపు చిన్న కార్యక్రమంలో పాల్గొని మద్దతు పలికారు. పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు యు.దివాకర్, ధామస్, శివకోటి చక్రం, బండి రవిసాగర్, జి.నరేష్, చిట్టిమూరి బాలు పాల్గొన్నారు.

ప్రచార రథయాత్ర

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో టీడీపీ మహిళా శక్తి ప్రచార రథయాత్రను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. మహిళలు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వివరించారు.

80 మందికి కంటి పరీక్షలు

కిర్లంపూడి: మండల పరిధి వీరవరం రామాలయంలో సోమవారం సీఎంసీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎంపీపీ తోట రవి ప్రారంభించారు. నేత్ర వైద్యులు వై. అమృతలాల్ 80 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 10 మందికి ఆపరేషన్లు చేయడానికి పిఠాపురం అగ్రహారంలో ఉన్న సీఎంసీ కంటి ఆసుపత్రికి తరలించారు. తోట విష్ణు, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, తోట నారాయణరావు, సిబ్బంది ఉమా, విజయ్‌కుమార్, వెంకటరత్నం, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- మెట్టలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న సర్కారు



గుమ్మరేగుల్లో బీరపాదులు పెంచేందుకు ఏర్పాటు చేసిన కంచెలు



రౌతులపూడిలో పందిళ్లపై సాగు చేసిన ఆకాకర పాదులు

రౌతులపూడి: ప్రస్తుతం రోజు రోజుకి మార్కెట్‌లో పెరుగుతున్న కూరగాయల ధరలు చూసి రైతులు వాటి సాగు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారికున్న భూమిలో కొంత కూరగాయల సాగుకు కేటాయించుకొని భూమిని చదును చేసి, కంచెలు, పందిళ్ల వంటి వసతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఏడాది మండలంలోని రౌతులపూడి, గుమ్మరేగుల, ఉప్పంపాలెం, మల్లంపేట, ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, గిడజాం, ఎస్.ఎస్ పట్నం, ములగపూడి, బలరామపురం, రాజవరం, దిగువశివాడ, గంగవరం, ఎస్.పైడిపాల తదితర గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో కూరగాయల సాగు చేపడుతున్నట్లు ప్రాథమిక అంచనా. మెట్ట ప్రాంతం కావటంతో సాధారణంగా బీర, చిక్కుడు, ఆనప, కాకర, ఆకాకర, గుమ్మడి వంటి పాదుజాతుల రకాల కూరగాయలు, బెండ, వంగ, టమాటా, పచ్చిమిర్చి, మునగ, గోరుచిక్కుడు వంటి మొక్క జాతి పంటలను పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో నీటివనరులు తక్కువగా వుండటం వలన ఇక్కడి రైతులు పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తారు. పొలం గట్లపైన అంతర పంటలుగా బీర, చిక్కుడు, ఆనప వంటి తీగజాతి పంటలను వేస్తున్నారు. తక్కువ భూమిలో సాగు చేపట్టినప్పటికీ మిగిలిన పంటల పెట్టుబడులకు అవసరమైన ఖర్చులు ఈ కూరగాయలు సాగు ద్వారా భర్తీ చేసుకోవటానికి వీలుంటుందని రైతులు పేర్కొంటున్నారు. వాతావరణం అనుకూలించి మంచి దిగుబడి వచ్చి, మార్కెట్లో ధరలు నిలకడగా వుంటే లాభసాటిగా ఉంటుందని, నష్టం వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని రైతులు అంటున్నారు.

ప్రభుత్వ సహకారం

కూరగాయల సాగుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకునేందుకు రైతులను చైతన్యవరచవలసిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అవసరమైన స్ప్రేయర్లు, బిందు సేద్యానికి అవసరమైన సాంకేతిక పనిముట్లు, ఇతర వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించాలని కోరుతున్నారు. ఆ విధంగా సాయమందిస్తే కూరగాయల సాగు విస్తీర్ణత పెరుగుతుంది. మంచి దిగుబడి సాధించి లాభాలు ఆర్జించడానికి వీలుంటుందంటున్నారు.

ఆర్‌బీకేల ద్వారా చర్యలు

కూరగాయల సాగు చేపట్టే రైతులంతా స్థానికంగా ఉన్న రైతుభరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యానశాఖ కూరగాయల దిగుబడిని పెంచడానికి , రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై) క్రింద ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను అందిస్తోంది. బిందు, తుంపర్ల సేద్యం ద్వారా కూరగాయల సాగు చేపట్టేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా చర్యలు చేపట్టింది. దీని కోసం సూక్ష్మ నీటి వనరుల పథకం ద్వారా 90శాతం రాయితీతోను, బిందు సేద్యానికి అవసరమైన స్ప్రింక్లర్లకు 50శాతం రాయితీతో పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం సహకరిస్తోంది. నాణ్యమైన కూరగాయల ఉత్పత్తిని ఉద్పాదకతను పెంచడానికి, తీగజాతి కూరగాయల సాగుకు అవసరమైన శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక హెక్టారుకు (2.1/2 ఎకరాలు)కు రూ.లక్ష వరకు సాయం చేస్తోంది.

నష్టం ఉండదు



ఏటా అర ఎకరం భూమిలో బీర సాగు చేపడతాను. కంచెలు, క్రిమి సంహారక మందులకు రూ.30వేల వరకు పెట్టుబడి అవుతుంది. వాతావరణం అనుకూలించి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తే రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయాన్ని తీయవచ్చు. లాభం లేకున్నప్పటికీ కష్టం తప్ప ఎలాంటి నష్టం ఉండదు. ప్రభుత్వ యంత్రాంగం రైతులను చైతన్యవంతులను చేసి ఆ దిశగా కూరగాయల సాగు చేపట్టేందుకు ప్రోత్సహిస్తే బావుంటుంది.

– బత్తుల బాబ్జి రైతు, గుమ్మరేగుల

విత్తనాలకు రాయితీ



హైబ్రీడ్ కూరగాయల విత్తన ఖరీదులో 50శాతం రాయితీ లేదా హెక్టారుకు రూ.3 వేలు ఏది తక్కువైతే అది గరిష్ఠంగా 2.00 హెక్టార్లకు ఒక ఏడాదికి రాయితీ ఇస్తారు. ఈ రాయితీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుకోవచ్చు. రాయితీని సద్వినియోగం చేసుకొని మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది.

– అరుణ్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి, రౌతులపూడి మండలం

జగనన్న పాల వెల్లువతో గిట్టుబాటు ధర



ఎస్.చామవరం పాల సేకరణ కేంద్రంలో యంత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

తుని రూరల్: జగనన్న పాల వెల్లువతో పాల ఉత్పత్తుదారులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు అన్నారు. మంగళవారం తుని మండలం ఎస్.చామవరం, టి.వెంకటాపురం, తేటగుంట గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పాల సేకరణ యూనిట్లను ఆయన పరిశీలించారు. తేటగుంటలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆర్డీఓ రైతులతో మాట్లాడారు. ప్రైవేట్ డెయిరీల కంటే అధికంగా జగనన్న పాల వెల్లువ (అమూల్)లో ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. పాల సరఫరాకు రైతులు సిద్ధం కావాలన్నారు. పాల ఉత్పత్తి, సేకరణలో జిల్లాకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్, ఎంపీడీఓ పి.రవికుమార్, సర్పంచ్ అత్తి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాను మెరుగు పర్చాలి

ప్రత్తిపాడు రూరల్: ప్రజా రవాణాను మెరుగు పర్చాలని ప్రముఖ న్యాయవాది, యునైటెడ్ ఫోరమ్ మానవ హక్కుల జాతీయ లీగల్ సెల్ సెక్రటరీ పిల్లి పలరాముడు అన్నారు. మండలంలోని బాపన్నదార గ్రామంలో ఆయన ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పౌర హక్కులపై అవగాహన కల్పించారు.

బీఎల్‌ఏలను ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సుబ్బలక్ష్మి

ప్రత్తిపాడు: వివిధ రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ అసిస్టెంట్ల(బీఎల్ఏ)ను నియమించుకోవచ్చని ప్రత్తిపాడు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి స్పష్టం చేశారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాపై నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జరుగుతున్న ఇంటింటా సర్వేలో బూత్ లెవెల్ అధికారి (బీఎల్ఓ) వెంట ఉండాలన్నారు. బీఎల్ఓ విధులకు ఆటంకం కలిగించరాదని చెప్పారు. ఓటరు సర్వేలో తప్పిదాలు లేకుండా పారదర్శకంగా జరిగేలా బీఎల్ఏలు సహకరించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలలో 92,236 గృహాలుండగా ఇప్పటివరకు బీఎల్ఓలు 7,941 గృహాలను సందర్శించారని చెప్పారు. 2,08,776 మంది ఓటర్లుండగా ఓటరు జాబితాలోని 15,839 మంది పేర్లను సరిచూశామని చెప్పారు. ఈ నెల 8న జరుగనున్న సమావేశానికి బీఎల్ఏలను హాజరుపరిస్తే, వారికి ఓటరు జాబితా సవరణ, ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి.చిన్నారావు, కె.సుబ్రహ్మణ్యం, జి భీమారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ ఏసీఎస్ రామిశెట్టి చినబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, కర్రి ధర్మరాజు, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు అమరాధి వెంకట్రావు, సీపీఐ నాయకుడు కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



ధర్మవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ శ్రీదేవి

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారు జాము నుంచి పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టారు. మండలంలో 1,536 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి వుంది. ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, వేములపాలెం, శరభవరం, గజ్జనపూడి, బురదకోట, గోకవరం,యూజే పురం, వాకపల్లి, పోతులూరు, పాండవులపాలెం తదితర గ్రామాల్లో ఒక్కరోజులో లబ్ధిదారులకు 75 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ తెలిపారు.

ఏలేశ్వరం: తెల్లవారు జాము నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ మంగళవారం జోరుగా జరిగింది. వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. మండలంలో 6,645 పింఛన్లు ఉండగా దాదాపు 70 శాతం పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో రోజుల తరబడి పింఛన్లు పంపిణీ చేసేవారని, ప్రస్తుతం ఒకటో తేదీనే అందజేస్తున్నారని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ల సేవలపై లబ్ధిదారుల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

శంఖవరం: హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి కమిమి ఉపాధ్యక్షుడు శాంతరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కత్తిపూడిలో ఇంటింటా తిరిగి హిందూ ధర్మం గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడు అన్నారు. అందుకే గురు పౌర్ణమి రోజున శ్రీ కృష్ణ భగవంతుడిని పూజించాలన్నారు. హిందు ధర్మం అతి పురాతనమైనదని, ఆ ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం భగవద్గీత ప్రచార కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగన్‌ను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తంటికొండలో గడపగడపకూ మన ప్రభుత్వం



తంటికొండలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పక్క రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. సోమవారం తంటికొండలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. స్థానిక నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా ? అని ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, గతంలో ఎన్నడూ లేనంత విధంగా ఈ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. పేద ప్రజలకు చేస్తున్న సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్న చేస్తున్నాయన్నారు. సమస్యలన్నీ గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దాసరి శ్రీరంగరమేష్, సుంకర వీరబాబు, జనపరెడ్డి సుబ్బారావు, బదిరెడ్డి రెడ్డియ్య, బదిరెడ్డి అప్పన్న దొర పాల్గొన్నారు.

వన దుర్గమ్మవారికి ప్రత్యంగిర హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి అధిక శ్రావణ పూర్ణిమ సందర్భంగా మంగళవారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పండితులు యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, వన దుర్గ ఆలయ అర్చకులు చిట్టిం వాసు, నగేష్, ముఖ్య అర్చక గంగాధరబట్ల శ్రీనివాస్, వ్రత పురోహితులు హోమం నిర్వహించారు.

వైభవంగా సుదర్శన హోమం



ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రతువులో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి ప్రీతికరమైన మహాచండీ హోమం నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో అధిక శ్రావణ పౌర్ణమి సందర్భంగా 33 మంది వైదిక బృందం, పురుషోత్తమ సపర్య కార్యక్రమాన్ని నిర్వహించింది. హోమం, పూర్ణాహుతి జరిపించారు. వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రంలో పౌర్ణిమ పూజలు



ప్రత్యేక అలంకరణలో అపిత కుచాంబ అమ్మవారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపితకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో మంగళవారం పౌర్ణిమ పూజలు నిర్వహించారు. శ్రీరమణ సేవాశ్రమంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనల అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు, ఉపాలయాల్లోని దేవతామూర్తులకు భక్తులు పూజలు చేశారు. మహిళలు పూజలు, పారాయణ చేశారు. ఆలయ పీఠాధిపతి రమణస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రూ. 60 వేల విలువైన సామాన్లు, నగదు మాయం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే మార్గంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు సిరిదిల్ల వీరన్న గురువు, ధర్మవీర్ ఆధ్యాత్మిక చైతన్య వేదిక సోషల్ మీడియా కన్వీనర్ వట్టూరి సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుర్తుతెలియని దుండగులు ఆలయానికి పక్కనే ఉన్న షెడ్డులో గల ఇనుప రాడ్డుతో ఆలయం ముఖద్వారం తాళం కప్పను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఆలయంలో గల కత్తిని, ఇనుప రాడ్డు సహాయంతో డిబ్బీని పగులగొట్టి వాటిలో రూ.2,000, బీరువాను తెరచి మైక్ సెట్, యాంప్లిఫైర్, దేవుడి ఇత్తడి, రాగి సామాన్లు దొంగిలించుకుపోయారు. మొత్తం రూ. 60 వేల విలువైన సామాన్లు చోరీ అయినట్టు వీరన్న గురువు, పోతుల శ్రీనివాసరావు, నల్లాకుల తాతబ్బాయి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పోలీసులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ఏలేశ్వరం: కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని పట్టణంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం పునరుద్దరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తుని: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సీఐటీయూ కార్యదర్శి షేక్ పద్మ కోరారు. మంగళవారం తుని, కోటనందూరు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. నాయకులు సూకరాజు, మాణిక్యం, నాగేశ్వరరావు, సమ్మయ్య, అప్పారావు, కన్నబాబు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

కిర్లంపూడి: ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు వీధుల్లో ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ మడిక శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రాపేటి రమేష్, బుద్ద వీరబాబు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి

గోకవరం: ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి శ్రీరంగ రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ అన్నారు. సోమవారం వీరలంకపల్లిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా సుమారు 22 లక్షల వ్యయంతో ప్రతి ఇంటికి కుళాయి పనులకు వారు శంకుస్థాపన చేశారు. వైస్ ప్రెసిడెంట్ అల్లాడ రాంబాబు, చింతల అనిల్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తొలిసారిగా ఏఈఓ స్థాయి నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల వరకు 98 మంది ఉద్యోగుల అంతర్గత బదిలీలు నిర్వహించారు. మూడు నెలల కొకసారి దేవస్థానం సిబ్బందిని అంతర్గత బదిలీలు నిర్వహించాలన్న దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు నిర్వహించినట్టు ఈఓ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం తెలిపారు. పీఆర్వో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు స్థానంలో ఏఈఓ పాలంకి జగ్గారావును నియమించారు. బుధవారం సాయంత్రానికి సిబ్బంది బదిలీ అయిన స్థానాలలో జాయిన్ అవ్వాలని ఈఓ ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, సంబంధిత విభాగ ఏఈఓలు ఈ బదిలీలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

సంక్షిప్తంగా..

నేరస్తులను శిక్షించాలి

కిర్లంపూడి: మండల పరిధి గోనేడ గ్రామానికి చెందిన పొన్నపల్లి గోవింద్ మూడో కుమారుడు, ఇంటర్ విద్యార్థి పొన్నపల్లి సీతారాం(16)మరణానికి కారణమైన వారిపై పోలీసులు కేసులు పెట్టాలంటూ ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి వీరవెంకట సత్యగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తల్లిదండ్రులు, నాయీ బ్రహ్మణ సమాఖ్య సభ్యులు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ మడిక శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరవెంకట సత్యగోపాలకృష్ణ మాట్లాడుతూ కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తీసుకోలేదని, ఉన్నత అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి సీతారాం మరణానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్సై జి.వెంకటేశ్వరావును వివరణ అడగగా విద్యార్థిమరణంపై యానాం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందన్నారు. సోదరులు, తల్లి పి.పార్వతి, సత్యనారాయణ, తాతారావు, పెంటకోట సత్యనారాయణ, నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంటువ్యాధులతో జాగ్రత్త

జగ్గంపేట: వర్షాలు జోరుగా కురుస్తున్న కారణంగా అంటువ్యాధులు ప్రబలే సమయం వచ్చిందని, గ్రామాల్లో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా వుండాలని రాజపూడి మెడికల్ ఆఫీసర్ గౌతమి అన్నారు. రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా డెంగీ, వైరల్ జ్వరాలు, మలేరియా, డయేరియా వంటి వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని చెప్పారు. దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని, దోమల వ్యాప్తికి కారణాలు, నివారణ చర్యలను ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో నెలకు రెండుసార్లు ఫ్యామిలీ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి జీవన్‌కుమార్, సీహెచ్‌ఓ శర్మ, హెల్త్ సూపర్‌వైజర్లు, పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

తుని రూరల్: స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పక్షాలన్నీ సమన్వయంతో సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మనోరమ అన్నారు. మంగళవారం తుని మండల రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పక్షాల నాయకులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. బీఎల్ఓలతో బీఎల్ఏలు కూడా సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఒకే పేరుతో రెండింటికిపైగా ఉన్న ఓట్లు, మృతుల ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల నమోదులో బీఎల్ఏలకు తగిన సూచనలు రాజకీయ పక్షాలు ఇవ్వాలన్నారు. ఇంటింటా ఓట్ల సర్వేలో 93వేల కుటుంబాలను సందర్శించాల్సి ఉండగా ఇప్పటికి 17వేలు పూర్తయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే ఏఈఆర్‌ఓలకు నేరుగా తెలియజేయాలన్నారు. తుని, తొండంగి తహసీల్దార్‌లు శివకుమార్, బాలసుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు చింతంనీడి కృష్ణ, శెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మళ్ల గణేష్, వంగలపూడి బుజ్జి, బీజేపీ నాయకులు ప్రగడ చక్రరావు, ఆకెళ్ల శాస్త్రి, పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

రౌతులపూడి: సమాజాన్ని పట్టిపీడిస్తున్న అసాంఘిక శక్తులకు ప్రజలంతా దూరంగా వుండాలని ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు అన్నారు. రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ అధ్యక్షతన మంగళవారం స్థానిక సచివాలయం-1 వద్ద వారధి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా, పేకాట, కోడిపందేలు, ఇతర జూదాలకు దూరంగా వుండాలని సూచించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల వైఎస్సార్‌సీ పీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఆటోయూనియన్ అధ్యక్షుడు బర్రే రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ

అన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) వర్తింప చేస్తున్నట్లు సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా తెలిపారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలను 40 మంది కార్మికులకు మంగళవారం అందజేసినట్లు తెలిపారు.